వటపత్రశాయి- 35- క్రియాశీలక సంఘ సేవకుడు కాకపోయినా, సంస్కారాన్ని కాంక్షించేవాడు. వితంతు వివాహాలు విస్తారంగా జరగాలని అతని ఆకాంక్ష. కందుకూరి, గురజాడ అతనికి ఆరాధ్యులు. తనకి ఇటువంటి సంస్కరణాభిలాష కలగకముందు వివాహం అయిపోయిందని బాధపడుతూంటాడు. లేకపోతే వితంతు వివాహం చేసుకుని సంస్కారాన్ని చాటేవాడే!

అవివాహితుడైన వ్యక్తి- వితంతువుని వివాహం చేసుకోడం హర్షణీయమే! కాని అలా సాహసించేవాళ్లు వేళ్ల మీద లెక్కించదగినవాళ్లే! కనీసం విధురుడైనా, వితంతువుని వివాహం చేసుకోడం కనీసం ధర్మం, సాంఘిక న్యాయమూను. అయితే ఆ వితంతువుకి తన మొదటి భర్తవల్ల పుట్టిన పిల్లల్ని, తన కొత్త భర్త జాగ్రత్తగా నిష్పక్షపాతంగా చూసుకుంటాడా అని సందేహించవచ్చు. పురుషుడు, తనకి భార్య పోయినప్పుడు ఆమెకు పుట్టిన బిడ్డల్ని ద్వితీయ కళత్రం ఎలా చూసుకోవాలని ఆశిస్తాడే- అలాగే స్త్రీకి కూడా భర్తపోయినప్పుడు, ఆమెకు తన మొదటి భర్తవల్ల కలిగిన బిడ్డల్ని కూడా ఆమె కొత్త భర్త అభిమానంగా చూసుకోవాలని కోరుకుంటుంది. అలా చూసినప్పుడు 'సవతితల్లి ప్రేమ' అనే దుష్కోక్తి

# తిరిగి మొదటికే

## - బులుసు- జీ- ప్రకాష్



వమ్ము అయితీరుతుంది!

ఇవీ- వటపత్రశాయిలోని సంక్షిప్త భావాలు.

రెండవ శిశువు జన్మించేక, ప్రసవ సమయంలో కన్నుమూసింది వటపత్రశాయి భార్య, దురదృష్టవశాత్తూ. పాపం, ఇద్దరు పిల్లల్నీ చూసే దక్షత లేకపోయింది వటపత్రశాయికి.

''నాయనా! నేనెన్నాళ్లుంటానో చెప్పలేనురా. ముసలితనంవల్ల ఈ పసికందులిద్దర్నీ సాకలేకపోతున్నాను. నీ మరదలు మేదినీదేవిని చేసేసుకోరా నాయనా! నీపిల్లలు దాని అక్కపిల్లలే కనక అభిమానంగా చూసుకుంటుంది.'' అని తల్లి సలహా చెప్పింది పుత్రవాత్సల్యంతో.

''అమ్మా! నేను మొదటిసారి వివాహం చేసుకున్నప్పుడు సంఘ సంస్కరణ గురించి సరియైన అవగాహన లేదు. ఇప్పుడు నేను పెళ్లంటూ చేసుకుంటే వితంతువునే చేసుకుంటాను. ఆమెకు తన మొదటి భర్తవల్ల కలిగిన పిల్లలున్నాసరే'' అన్నాడు వటపత్రశాయి.

తన అల్లుడు, తన రెండవ కుమార్తెని వివాహం చేసుకోడానికి అంగీకరించకపోవడంవల్ల, మేదినీదేవి తండ్రి, తన కుమార్తెను వేరొకనికి ధారాధత్తం చేసేశాడు.

వటపత్రశాయి తన ఆశయాలను దృష్టిలో పెట్టుకుని, తను విధురుడనని- ఇరువురు పిల్లల తండ్రినని- వయస్సు నలభై అని పునర్వివాహానికి వితంతువుని- ఆమెకు పిల్లలున్నాసరే- వివాహం చేసుకుందికి- అదైనా రిజిస్టర్డ్ మేరేజ్‌కు- సిద్ధమని- తగిన అభ్యర్థినుల నుండి దరఖాస్తులు కోరేడు, పత్రికాముఖంగా.

సంఘపరమైన అనేకానేక సాధక బాధకాలుండడంవలన, అంటే బిడ్డల తల్లి అయిన వితంతువు, తన పిల్లలు ఊహ తెలిసినవాళ్లవడంవల్ల- తమ కొత్త నాన్నని 'నాన్నా!' అని పిలవలేరు. ఎందుకంటే వాళ్ల అసలునాన్న మొహం వాళ్లకి తెలుసుకనుక. అంచేత అలాంటి వితంతువులు వటపత్రశాయి పత్రికా ప్రకటనకి స్పందించలేదు.

మరికొందరు వితంతువులు- తాము ఆరునెలలైనా తిరక్కుండానే వితంతువులు కావడంవల్ల ఆ షాక్ నుంచి ఇంకా తేరుకోలేదు. తాము ఒకవేళ దరఖాస్తు చేసినా- తమ ప్రథమ పతిదేవుల స్మృతులు తమనింకా వెంటాడుతూనే వుంటాయి. అంచేత ఈ తరహా వితంతవులు కూడా స్పందించలేదు.

ఇలా మూడేళ్లు గడిచేయి.

ఇంట్లో తల్లిపోరు పడలేకపోతున్నాడు వటపత్రశాయి.

ఇంతలో అదృష్టమో దురదృష్టమో, విధి కర్మమోకాని వటపత్రశాయి మరదలు మేదినీదేవి, ఇద్దరు పిల్లలకి తల్లి అయిన తరువాత, వైధవ్యం అనుభవించవలసి వచ్చింది. రెండేళ్ల బాబు, ఆరు నెలలపాప ఆమె సంతానం.

ఇప్పుడు విధురుడైన వటపత్రశాయి వితంతు మరదలైన మేదినీదేవిని పునర్వివాహం చేసుకున్నాడు.

తన రెండేళ్ల బాబుకి, దేవుడి దగ్గరకెళ్లి తిరిగి వచ్చిన నాన్న ఈయనే అని చూపించింది మేదినీదేవి. బాబు పొంగిపోయి నాన్న చంకనెక్కాడు బొటనవ్రేలు నోట్లో పెట్టుకుంటూ.

అదేవిధంగా, తన పిల్లలకి దేవుడి దగ్గరకెళ్లిన తల్లి తిరిగొచ్చింది ఈవిడే అని చూపించాడు వటపత్రశాయి. అంతకుముందే తనూ మేదినీదేవి కూడా కు.ని. ఆపరేషన్లు చేయించుకున్నవారే గనుక వాళ్లిద్దరికీ సంతానం కలిగే అవకాశంలేదు. లేకపోతే కలతలు బయలుదేరేవే.

వటపత్రశాయి మేదినీదేవీల విచిత్ర పునర్వివాహాన్ని చూసినవాళ్లలో కొందరు 'ఇదొక విధివిలాసం' అన్నారు. కాదు 'షీర్ కో-ఇన్సిడెన్స్' అన్నారు హేతువాదులు.

ఎవరు ఏమన్నా- వటపత్రశాయి అనే పిల్లలున్న విధురుడు మేదినీదేవి అనే వితంతువుని- ఆమె మొదటి భర్తవల్ల కలిగిన పిల్లలున్నాసరే- వివాహం చేసుకున్నాడు. ఆవిధంగా విడోయర్, విడోనే మేరేజ్ చేసుకోవాలనే అతని ధ్యేయం నెరవేరింది. అదైనా ఒకప్పుడు తను కాదన్న మరదలితోనే!

★